రాధిక: ఆయన బ్రిటీష్ పారిశ్రామికవేత్త. ఆయనకు లండన్‌లోనూ, కొలంబోలోను, కోయంబత్తూర్‌లోనూ ఫ్యాక్టరీలున్నాయి. ఆర్టిస్ట్‌గా నాకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. లండన్‌లో ఖాళీగా కూర్చునే బదులు తిరిగి సినిమాల్లో నటించమని సలహా ఇచ్చిందాయనే. నా అత్తమామలు కూడా ఎంతో ఆప్యాయంగా నన్ను చూసుకుంటున్నారు. ఆగష్టు 10 మా మ్యారేజ్‌డే షూటింగ్ బిజీలో ఎక్కడున్నా ఆ రోజు లండన్ వెళ్ళి అక్కడ గడిపేస్తాను. ఇప్పుడు నా జీవితం ఎంతో హాయిగా వుంది.

వ.జ్యో: మీరు నటించిన చిత్రాలూ... అవార్డుల విశేషాలు...

రాధిక: 14 సంవత్సరాల కాలంలో దాదాపు 190 చిత్రాల వరకూ పూర్తి చేశాను. వీటిలో తెలుగు, తమిళ, కన్నడ, హిందీ చిత్రాలున్నాయి. ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వాల నుండి, ఫిలింఫేర్, సినిమా ఎక్స్‌ప్రెస్ లాంటి ప్రముఖ సంస్థల నుండి ఎన్నోసార్లు ఉత్తమ నటిగా అవార్డులొచ్చాయి.

వ.జ్యో: మళ్ళీ చిత్రాలు స్వంతంగా నిర్మించే వుద్దేశ్యం వుందంటారా?

రాధిక: వుంది. ప్రస్తుతం తెలుగులో విజయం సాధించిన కలికాలం చిత్రాన్ని తమిళంలో పునర్నిర్మిస్తూ జయసుధ పాత్రను ధరిస్తున్నాను.

వ.జ్యో: చివరిగా మీకు తీరని కోరిక ఏమైనా వుందా?

రాధిక: వుంది. ఇన్ని చిత్రాల్లో నటించినా నాకింతవరకు 'మరపురాని పాత్ర' దొరకలేదనిపిస్తోంది. దానికోసం ఎదురుచూస్తున్నాను.

ఆమె కోరిక అతి త్వరలోనే నెరవేరగలదని బెస్ట్ విషెస్ చెప్పి విశ్రమించింది వనితాజ్యోతి.

ఇంటర్వ్యూ: శేఖర్ (కార్టూనిస్టు)

**సవరణ**

అక్టోబరు సంచికలో నటి జయంతి ఇంటర్వ్యూలో ఆమె మొదటి చిత్రం జగదేక వీరుడుగా ప్రచురితమయింది. అది జగదేక వీరుని కథగా, దర్శకుడు కె.వి. రెడ్డిగా గమనించగోర్తాము.

ఎడిటర్

# దీపాల పండుగ

## సత్యవాడ సోదరీమణులు

శ్యామల కాలేజి నుంచి వచ్చేసరికి తమ్ముళ్ళు ఇద్దరూ ఎంతో హడావిడిగా తారాజువ్వలు సిసింద్రీలు తయారు చేస్తున్నారు.

"అబ్బబ్బ! అప్పుడే మొదలు పెట్టారూ" అంది నిసుగ్గా

"అప్పుడే ఏమిటక్కయ్యా! ఇంక ఒక వారం రోజులే వుంది దీపావళి" అన్నాడు శ్యామల పెద్ద తమ్ముడు. ఇప్పటికే ఆలస్యం అయిపోయింది ఒక్క వారం రోజుల్లో తయారు చేసుకోవటమే చాలా కష్టం అన్నాడు చిన్న తమ్ముడు; శ్యామల ఇంకేమీ మాట్లాడకుండా లోపలికి వెళ్ళిపోయింది. ముఖం కడుక్కుని వంటింట్లోకి వెళ్ళింది.

జానకమ్మ వంట చేస్తోంది. తల్లి దగ్గరగా పీట వాల్చుకుని కుర్చుంది. శ్యామల చేస్తున్న పని ఆపుచేసి శ్యామలకు కాఫీ కలిపి ఇచ్చింది. జానకమ్మ ఈ రోజు అమ్మ ఎందుకో దిగులుగా వుంది', రోజూ తను కాలేజి నుండి రాగానే ఏవో కబుర్లు చెప్పే అమ్మ మౌనంగా తన పని చేసుకుంటూంది" ఆలోచిస్తూనే కాఫీ తాగటం ముగించి గ్లాసు ప్రక్కన పెట్టేసింది.

తన గదిలోకి వెళ్ళి వారపత్రిక తిరగేస్తూ కూర్చుంది. ఆ పత్రికలో అచ్చయిన తన కథను మళ్ళీ మళ్ళీ చదువుకుంది. తను ఈ కథ బాగానే రాయగలిగింది. తన ఆశయాలు కథలో ప్రతిఫలింపచేసింది తన కథలోని సుజాతను ఉన్నతాదర్శాలుగల యువతిగా చిత్రించింది.

ఎంతో పట్టుదలతో చదివి తనకు ఎదురయ్యే జటిలమైన సమస్యలను చిత్తస్థైర్యంతో ఎదుర్కొని మహిళా న్యాయ వాదిగా పేరు ప్రఖ్యాతులు గణించుకుంది. తన ఆదర్శాలను గౌరవించే యువకుని చేపట్టి పరిపూర్ణ శక్తిని తన ఆశయాలకు కల్పించుకుంది తన కథలోని పాత్ర సుజాత. ఈ కథ ద్వారా తను యువతరానికి చక్కని సందేశాన్ని అందివ్వ గలిగింది. అలా ఆలోచిస్తున్న శ్యామల మనస్సు క్రొత్త ఉత్సాహాన్ని పుంజుకుంది. పత్రిక ప్రక్కన పడేసి కలంకాగితం చేతుల్లోకి తీసుకుంది. ఈసారి ఇంకా చక్కని కథ రాయాలి. సామాజిక ప్రయోజనం సాహిత్యపు విలువలు తన కథలో ఇమిడి వుండాలి అనుకొని వ్రాయటానికి ఉపక్రమించింది. ఓ ఐదు నిముషాలు గడిచాయో లేదో చెల్లెలు లత రివ్వున దూసుకొచ్చింది.

"అక్కాయి నీకు ఈ సంగతి తెలుసా" అంది.

"ఏ సంగతే" అడిగింది శ్యామల తన పని చేసుకుంటూనే. 'అయ్యో! అమ్మ నీకు చెప్పలేదా? రెండు వారాల క్రితం నిన్ను చూచి వెళ్ళారే, ఆ పెళ్ళి వారికి నువ్వు నచ్చలేదట. అంటే నువ్వు నచ్చావుట గాని నాన్నగారు ఇస్తామన్న ఇరవై వేల కట్నం చాలదట. మినిమమ్ కనీసం ఇరవై ఐదువేలో ఇస్తే తప్పక చేసుకుంటారట. ఆ ఉత్తరం పెండ్లి కొడుకు తండ్రి వ్రాశాడు. అమ్మా నాన్నా ఎంత బాధ పడుతున్నారో?" శ్యామల చేతిలోని కలం జారిపడింది.

మనస్సులోని వూహలన్నీ చెదరిపోయాయి. అందుకన్నమాట అమ్మ దిగులుగా వుంది. శ్యామల ముఖ కవళికలు గమనిస్తున్న లత "బాధ పడుతున్నావా అక్కయ్యా?" మనం ఎంత అనుకుంటున్నా అందరి మనస్సులలో మార్పు రానిదే ఈ వ్యవస్థ మారదు. ఆడపిల్లకు అంద చందాలు అణకువ చదువు ఎన్ని వున్నా కట్నం పేరిట ఎంతో డబ్బు కుమ్మరిస్తేగాని మూడు ముళ్ళు పడవు" అంది.

"నాకు ఈ సంబంధం తప్పి పోతున్నందుకు బాధలేదు; మ్మ నాన్న తలచుకుంటే

మనస్సు భారం అయిపోతుంది. నా పెళ్ళి కోసమే వాళ్ళకు ఆరాటం. తాహతుకు మించిన కట్నాలు ఇవ్వలేరు. స్వార్థం పేరుకుపోయిన ఈ సమాజంలో కట్నం కోరని అల్లుణ్ణి పొందలేరు'' నిట్టూర్చింది శ్యామల.

జానకమ్మ పిలవటంతో లత వంటింట్లోకి వెళ్ళిపోయింది. రచయిత్రి శ్యామల మనస్సులో ఇంతవరకూ ఎన్నో రంగుల ఊహలు తను ఎంతో చక్కని రచనలు చేసి సమాజ అభ్యుదయానికి తోడ్పడాలని కాని లత చెప్పిన విషయం తన మనస్సులోని ఊహలన్నింటిని చెదర గొట్టేసింది. ఇప్పుడు తన మనసంతా కలతగా వుంది. తన పెళ్ళి తల్లి దండ్రులకు ఓ సమస్య అయిపోయింది.


''ఎంతో ప్రయాసతో తనను ''యమ్.ఎ.'' వరకు చదివించి ఇప్పుడు కోరినంత కట్నం ఇచ్చి వివాహం చేయలేక బాధపడుతున్నారు. చదువుకొని సంపాదిస్తున్న ఆడపిల్ల అయి పుట్టినందుకు తనవల్ల తల్లిదండ్రులకు ఆవేదనే మిగిలింది. ఈ వరకట్న దురాచారం ఇలా ఎందరు కన్నెపిల్లలను వాళ్ళ తల్లిదండ్రులను క్రుంగ దీస్తున్నదో'' అలా ఆలోచిస్తూ ఎంత సేపు గడిపేసిందో! గది అంతా చీకటి ఆవరించుకుంది. లేచి లైటు వేసుకోగానే ఆ గదే వెలుగుతో నిండిపోయింది. ''స్వార్థపు చీకటి ఆవరించుకున్న హృదయాలలో కూడ ఏనాడైన ఆ చీకటి తొలగి వెలుగు నిండుతుందా అనుకుంది.

''సారీ శ్యామలా నీవు ఏదో వ్రాసుకుంటున్నట్టున్నావు. నా రాక నీ రచనా వ్యాసంగానికి అంతరాయమేమో! అంటూ గదిలోకి అడుగు పెట్టింది. సురేఖ స్నేహితురాల్ని ఆప్యాయంగా పలుకరించి అబ్బే! అదేం లేదే. ఇంకా నువ్వు రావటమే అలసిపోయిన నా మనసుకు కాస్త హాయినిస్తుంది అంది శ్యామల. శ్యామల ప్రక్కనే కూర్చుని ఆమె చేతిని తన చేతులోకి తీసుకుంది ప్రేమగా ఒకరి కళ్ళలోకి ఒకరు చూచుకున్నారు. ఇద్దరి హృదయాలలోని వ్యాకులత ఒకరిలో మరొకరికి కనిపించాయి. అలా వున్నావే! ఒకరి నుద్దేశించి ఒకరు ఒకేసారి అన్నారు. ఇద్దరూ నిట్టూర్చారు.


సురేఖ సర్దుకుని ''ఏమిటే శ్యామలా! పెండ్లి కూతురివి కాబోతున్నావట'' అంది. శ్యామల పేలవంగా నవ్వింది. పెండ్లి చూపుల వరకు ఆ మాట నిజం కాని అసలు పెళ్ళి కూతురు కావడం వరకట్న పిశాచం విలయతాండవం చేస్తున్నంతకాలం అంత తేలిక కాదు'' అంది. అయితే ఈ కథ కూడా ఇంతేనన్న మాట. అయినా శ్యామలా ఇంతేనే ఈ మగవాళ్ళు. చక్కగా చదువుకున్నావు, సంపాదిస్తున్నావు, ఉద్యోగస్తురాలివి. నీ పెళ్ళికి ఈ కట్నం సమస్య ఎదురైతే ఏమనుకోవాలి? అంతేనే సురేఖా! ఎంత చదువుకున్నా, సంపాదిస్తున్నా ఆడపిల్ల పెళ్ళి కట్నంతోనే ముడిపడివుంది. కానీ ఇందుకు




పూర్తిగా మొగవాళ్ళనే అనుకోనక్కర్లేదు. వచ్చే కోడలు ఎంత కట్నం తెస్తే అంత గొప్పతనం అనుకుంటారు అబ్బాయిల తల్లులు. తనకి అన్నదమ్ముల పెళ్ళిలో కానుకల రూపంలో ఎంత ముడుతుందో అని ఆశిస్తారు. అలా ఆలోచిస్తారేగాని తమవంటి ఆడపిల్లలే ఇంటికి వచ్చేదని అనుకోరు. సాటి స్త్రీలే ఇలా ప్రవర్తిస్తుంటే ఈ సమస్యలు అంతరించేది ఎప్పుడో'' అంది శ్యామల. ''ఇదిగోనే శ్యామలా నీ దగ్గర ఆ రోజు తీసుకున్న బదులు ఇప్పటి వరకు ఇవ్వలేకపోయాను అంటూ తన పర్సులో నుంచి వంద రూపాయిలు తీసి శ్యామలకు అందించింది. ''మా అన్నయ్యా అమ్మా కూడా నిన్ను ఏమీ అనుకోవద్దు అని మరీ మరీ చెప్పమన్నారు'' అంది. ''అది సరేకాని ఆ ఉద్యోగం మీ అన్నయ్యకు రానట్టేనా'' అడిగింది. ''అంతే మరి, నాలుగు వందలు ఖర్చుపెట్టి అంత దూరం ఇంటర్వ్యూకు వెళ్ళి రావటం నిష్ప్రయోజనం అయిపోయింది. అన్నయ్య అయితే ఏదో షాకు తిన్నట్టుగా అయిపోయాడు అనుకో. వాడికి ధైర్యము చెప్పటానికి నేనూ అమ్మా ఎంత ప్రయత్నిస్తున్నామో! ప్రతిసారి ఎంతో ఆశతో ఇంటర్వ్యూకు హాజరు కావటం ఫలితం తెలిసాక మళ్ళీ నిరాశామయ హృదయంతో నిరుద్యోగిగా మిగిలిపోవటం పరిపాటైపోయింది. ''పోనీలేవే ఏదో ఓ ఉద్యోగం రాకపోదు మీ అన్నయ్యకి. ''సురేఖని ఊరడించడం కోసం అంది శ్యామల కరెంటు పోవటంతో మళ్ళీ గదంతా ఒక్కసా






రిగా చీకటి అలుముకుంది. 'అరే శ్యామలా కరెంటు ఆగిపోయింది. అబ్బ ఎంత చీకటో. కొవ్వొత్తి అయినా వెలిగించవే.

శ్యామల వేదాంతిలా నవ్వింది. 'ఈ సమస్యల చీకటుల ముందు ఈ చీకటి ఏపాటిది? అంది. 'నువ్వు మరీ వేదాంతిలా మాట్లాడుతావు బాబూ య్యా! మాటల్లోనే కరెంటు వచ్చేసింది. ఇక నేను వస్తానే చాలా రాత్రి అయిపోయింది'' అంటూ సురేఖ వెళ్ళిపోయింది. శ్యామల అలానే కూర్చుని ఆలోచిస్తూ వుంది. మూడు నెలల క్రితం సురేఖ అన్నయ్య ఇంటర్వ్యూకు వెళ్ళాలని అందుకు అవసరమని తన దగ్గర నాలుగు వందల రూపాయిలు బదులు తీసుకుంది. అతనికి ఉద్యోగం రాలేదుకాని అప్పు మిగిలింది. ఇలా మధ్యతరగతి బ్రతుకులలో ఎన్ని సమస్యలో? 'అక్కాయ్ అమ్మ భోజనానికి రమ్మంటోంది' లత పిలవటంతో ఆలోచనా లోకాన్ని వదిలి, వంటింట్లోకి వెళ్ళిపోయింది శ్యామల. భోజనం చేసి మంచం మీద వాలిపోయింది. అలసటగా వున్న శ్యామలకు వెంటనే నిద్ర పట్టేసింది.

పెరట్లో ఏదో గొడవ జరుగుతుంటే మెలకువ వచ్చేసింది శ్యామలకు. కిటికీలోంచి బయటకు చూసింది. 'అరే! తెల్లారిపోయిందే' అనుకుంది. పెరటి వైపు నుంచి వినిపిస్తున్న రోదన ఎవరిదో తెలుసు శ్యామలకు. కాని అందుకు కారణం ఏమై వుంటుందో వూహించలేక పోయింది. ఆత్రంగా పెరట్లోకి పరుగెత్తింది. అక్కడ ఎదురైన దృశ్యం శ్యామల సున్నితమైన మనస్సును కలచివేసింది. గుండెలు బాదుకొని రోదిస్తున్న రాములమ్మ దగ్గరకు వెళ్ళి ఏమైంది రాములమ్మా'' అడిగింది. ''ఇంకేటి సెప్పుకోను నా తల్లి! ఎదవ సచ్చినోడు మల్లి తప్పతాగి వచ్చిండు. నన్ను చితక తన్నేసిండు. ఆ పాడు సారాయి కోసం డబ్బు సాల్నేదని ఇంటికాడున్న గిన్నె ముంత అమ్ముకోటానికి రేతిరి పట్టుకెళ్ళిపోయిండు. వాట్ని కూడా అమ్మేసుకుని పాడు సారాయికే తగలేస్తే గంజయినా ఎట్టా కాసేది? పిల్లోళ్ళని ఎట్టా పెంచేదంట?'' రాములమ్మ మాటలు వింటూ బొమ్మలా నిలబడి పోయింది శ్యామల. జానకమ్మ పాతబడ్డ ఓ సిలవర్ గిన్నె తవ్వెడు నూకలు రాములమ్మకు ఇచ్చి ఏడ్చి మాత్రం ఏం లాభం రాములమ్మా ఈ నూకలు తీసుకుని మధ్యాహ్నం వచ్చేయి'' అని రాములమ్మను పంపించేసింది.

అమ్మ చేసిన పని శ్యామలకు కొంత తృప్తి కలిగించింది. అలా నిలబడ్డావేమిటమ్మా. ఇది రాములమ్మకు మామూలేగా. అది నాలుగిళ్ళు పనిచేసి సంపాదించటం, దాన్ని వాడు తాగి తగలేయటం'' అంది జానకమ్మ. ఇలా రాములమ్మ మొగుడు లాంటివాళ్ళు వ్యసనాలకు లోనవుతూ వుండబట్టే గుడిసెల్లో చీకటి పేరుకు పోతోంది అమ్మా'' అంది శ్యామల బావి దగ్గర మొఖం కడుక్కుంటూ.

''అంతే కాదమ్మా నిరక్షరాస్యులు నివసించే గుడిసెల్లోనే కాదమ్మా ఈ చీకటి పేరుకున్నది. విద్యాధికులు విజ్ఞాన వంతులు కూడ ఎందరో ఇలాంటి దురలవాట్లకు బానిసలై తమ బ్రతుకులు తమ వారి బ్రతుకులు మంట కలిపి అంధకార మయం చేసుకుంటున్నారు'' అన్నాడు శ్యామల తండ్రి రాఘవరావు.

ఈ ఆలోచనలన్నీ శ్యామల మనస్సుని పట్టి పీడిస్తూనే వున్నాయి. దీపావళి పండుగ దగ్గర పడుతున్న కొద్దీ ఇంటింటా సందడి ప్రారంభమయింది. శ్యామల ఆఖరి చెల్లెలు ''అక్కా! ఈ వేళ కాకరవత్తులు మతాబాలూ కొనిపెట్టవూ దీపావళి వచ్చేస్తోంది'' అంది గోముగా. ఆ సాయంత్రం చెల్లెలుతో బజారుకి వెళ్ళింది శ్యామల. చెల్లాయి కోసం కాకర పువ్వొత్తులు మతాబాలు కొని ఇంటికి తిరిగి వచ్చేసింది. బజారంతా ఎంత కోలాహలం? మందుగుండు సామాను దీపపు ప్రమిదలు కొనుక్కునే అందరి ముఖాలలోను ఎంత సంతోషమో! కాని ఈ ఆనందమంతా తాత్కాలికమే. ప్రతి జీవితంలోనూ ఎన్నెన్నో సమస్యల చీకటులు! నిట్టూర్చింది.

దీపావళి రానే వచ్చింది. ప్రతి ఇల్లు పండుగ సందడితో కళకళ లాడిపోతోంది. చీకటి పడుతోండగా రాములమ్మ వచ్చి ''అమ్మగారూ కాసింత సమురియ్యండి. ఈయేల దీపావళి పండుగ కదా. దీపావళి పండుగంటే మా మామకి బలే సంబరం దీపాలన్నీ వెలిగిస్తుంటే ఆ ఎలుగుతున్న దీపాలను సూసి ఎంతో ఇదిగా ముచ్చట పడిపోతాడమ్మా'' అంది.

''అమ్మా శ్యామలా దానికి కాస్త నూనె ఇచ్చి పంపించేసిరా చీకటి పడిపోతోంది. దీపాలు వెలిగిద్దాం' ' అంది జానకమ్మ. రాములమ్మను పంపించేసి శ్యామల తల్లితోను చెల్లితోను కలసి దీపాలు వెలిగించింది.

పంక్తులు తీర్చిన దీప సమూహం. చీకటిని దూరంగా తరిమేస్తుంది. ఊరూరా ఇంటింటా వాడవాడలా వెలిగే దీపాలు. శ్యామల మనోనేత్రం ముందు మెదిలాయి.

దీపావళి నాటి వెలుగు సాటిలేనిది. అందుకే ఇది దీపాల పండుగ కాని ఈ వెలుగు కనుపించేది కేవలం బాహ్య నేత్రాలకు మాత్రమే. ఈ దీపాలు పారద్రోలగలిగేది కళ్ళ ముందు కనిపించే చీకటిని మాత్రమే. అంతరంగాలలో అలముకొన్న తిమిరాలను అంతం చేసే దివ్య జ్యోతులు ప్రతి యెదలో వెలగాలి. మనుష్యులు తమ స్వార్థం కోసం తోటి వారి బ్రతుకులలో సమస్యల చీకట్లు వ్యాపింప చేయుటం మానేసి ప్రతివారు చుట్టుపక్కల వారికి వెలుగు నిచ్చే దీపంలా మంచితనపు కాంతులు వెదజల్లిన నాడు ఆనాడే వస్తుంది అసలైన దీపాల పండుగ అనుకుంది శ్యామల. O